భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 27.0
తణుకు : 31.0 - 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024



పింఛన్ల పండుగ



పేదలందరూ కోరుకున్న రోజు రానేవచ్చింది. కూటమి అధికార పగ్గాలు చేపట్టిన తొలిసారిగా పేదలు అందరికి పింఛన్ పండుగ నిర్వహిస్తోంది. ప్రతినెల ఇచ్చే రూ.3వేలను రూ.4 వేలకు పెంచడమే కాకుండా గడిచిన 3 నెలల పింఛన్‌తో కలిపి ఒకేసారి రూ.7 వేలు అందించనుంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

- ఒక్కరోజులోనే పూర్తిచెయ్యాలని లక్ష్యం
- జిల్లాలో 2,32,885 మంది పెన్షన్‌దారులు
- పెంచిన పెన్షన్, ఎరియర్స్‌తో కలిపి రూ.155.71 కోట్లు పంపిణీకి చర్యలు
- సచివాలయ, రెవెన్యూ సిబ్బంది సహకారం

భీమవరం టౌన్, జూన్ 29 : జిల్లాలో 2,32,885 మంది పెన్షన్ దారులకు 155.71 కోట్లు ఇంటింటికీ పంపిణీకి జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం సెలవు కావడంతో శనివారమే బ్యాంకుల నుంచి సొమ్ములు విత్ డ్రా చేయించారు. సోమవారం ఉదయం 6 గంటలకు పెన్షన్ లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించారు. సోమవారం నాడే నూరు శాతం పెన్షన్లు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,32,885 మందికి జూన్ నెల వరకు రూ.69.05 కోట్లు పంపిణీ కాగా, జూలై నెలలో 15 రకాల పెన్షన్ దారులకు అదనంగా పెంచిన మొత్తంతో కలిపి రూ97.69 కోట్లు, 10 రకాల పింఛన్ దారులకు ఏప్రిల్ నుంచి వెయ్యి రూపాయలు చొప్పున ఎరియర్స్ మూడు నెలలకు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.58.01 కోట్లు కలిపి రూ155.71 కోట్లు ఒకటవ తేదీన పంపిణీ చేయనున్నారు.

పేదలకు ఇది భరోసానే ..

ఇప్పటివరకు పేదలకు పింఛన్లు పెంచి ఇవ్వడంలో తెలుగుదేశం ప్రభుత్వానిదే అగ్రస్థానం. ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలో రూ.200 ఉన్న పింఛన్, చంద్రబాబు హయాంలో ఇప్పుడు రూ.4 వేలకు పెరగబోతోంది. గత ప్రభుత్వంలోనూ పింఛన్లు పెంచి ఇస్తామని అప్పటి జగన్ ప్రభుత్వం అవ్వా తాతలు అంటూనే అందరినీ మోసగించింది. కూటమి ఎన్నికల సమయంలో తాము అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, మిగతా వారందరికీ వివిధ కేటగిరీల కింద పింఛన్ పెంపుదల అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ పదేపదే ప్రజలకు భరోసా ఇస్తూ వచ్చారు. తమను విశ్వసించి గెలిపిస్తే ఇప్పటివరకు మూడునెలల పాటు ఉన్న పెండింగ్ నెలకు వెయ్యి చొప్పున మూడునెలలు లెక్కకట్టి జూలై 1వ తేదీనే అందిస్తామని ప్రకటన చేశారు.వృద్ధాప్య, వితంతువులు, ఒంటరి మహిళలు, మత్స్య కారులు, కల్లుగీత కార్మికులు, నేత కార్మికులు, చెప్పులు కుట్టువారు, డప్పు కళాకారులు ఇలాంటి వారందరికీ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పింఛన్ పెంచుతూ విధాన నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు మరో ఆరు కేటగిరీల్లో ఉన్న వారందరికి పింఛన్ పెంచుతూ పోయారు. దివ్యాంగ పింఛన్‌లను రూ.3వేల నుంచి రూ.6 వేలకు, కిడ్నీ రోగులకు, కాలేయం, గుండెమార్పిడి రోగులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, పక్షపాతంతో మంచం పట్టిన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలు కండరాల క్షీణిత కలిగిన వ్యాధిగ్రస్తులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలు అందజేయ బోతున్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా, పేదలను ఆదుకు నేందుకు పింఛన్లు పెంచటమే కాకుండా ఇప్పుడు అందించేందుకు యంత్రాంగాన్ని ముందుకు నడిపింది.



పెన్షన్ రకం	జూన్‌లో పెన్షన్ మొత్తం	జూలైలో పెంపు చేసిన మొత్తం
వృద్ధాప్య వితంతు, ఒంటరి మహిళ, మత్స్యకారులు, టోడీ ట్యాపర్లు నేత కార్మికులు, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, డప్పు కళాకారులు, కళాకారుల పెన్షన్లు, ఏఆర్‌టీ పెన్షన్లు	రూ.3,000	రూ.4,000
దివ్యాంగ పెన్షన్లు, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ	రూ.3,000	రూ.6,000
డయాలిసిస్, తలసేమియా మేజర్, సికిల్ సెల్ డిసీజ్ తీవ్రమైన హిమోఫిలియా	రూ.10,000	రూ.10,000
ద్వైపాక్షిక ఎలిఫాంటియాసిస్ - గ్రేడ్ 4, క్రానిక్ కిడ్నీ వ్యాధి రోగులు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి రోగులు	రూ.5,000	రూ.10,000
పక్షవాతం వ్యక్తిని చక్రాల కుర్చీ లేదా మంచానికి పరిమితం చేయడం	రూ.5,000	రూ.15,000
తీవ్రమైన కండరాల క్షీణత కేసులు, ప్రమాద బాధితులు	రూ.5,000	రూ.15,000
చక్రాల కుర్చీకి లేదా మంచానికి పరిమితమైన వారు		
సైనిక్ వెల్ఫేర్	రూ.5,000	రూ.5,000
అభయ హస్తం	రూ.500	రూ.500

అధికారులు రెడీ

పెన్షన్ పంపిణీ కోసం జిల్లా అధికారులు కసరత్తుపూర్తిచేశారు. పట్టణాల్లోను, గ్రామాల్లో ఉన్న సచివాలయ సిబ్బందిని పెన్షన్ పంపిణీకి నియమించారు. సరిపోని చోట్ల రెవెన్యూతో పాటు ఇతర శాఖ ఉద్యోగులను కూడా నియమించారు. సుమారు 4, 282 సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీలో పాల్గొంటున్నారు. ప్రతీ ఉద్యోగికి 50 పెన్షన్‌లు ఉండేలా మ్యాపింగ్ చేసి వారికి వివరాలు అందించారు. బయోమెట్రిక్‌లో పెన్షన్ ఇచ్చి వారినుంచి ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా తీసుకోనున్నారు. పెన్షన్‌ల పంపిణీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చెయ్యాలని ఆదేశాలు జారీచేశారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



శనివారమే సొమ్ములు డ్రా

పెన్షన్‌ల పంపిణీ కోసం నిధులు సిద్ధమయ్యాయి. ఆదివారం సెలవు కావడంతో జిల్లాలో అవసరమైన పెన్షన్ సొమ్మును శనివారం సాయంత్రానికి బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించి ఒక్క రోజులోనే అందరికీ పంపిణీ పూర్తి చేయాలని జిల్లా అధికారులు సంకల్పించారు. పెన్షన్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందేశాన్ని పెన్షన్ దారులకు వినిపిస్తారు. పెన్షన్ లబ్ధిదారుల నుంచి రశీదు తీసుకుంటారు. సచివాలయ సిబ్బంది తీసుకువెళ్లే రశీదుపై లబ్ధిదారులు సంతకం లేదంటే వేలిముద్ర వేయాలి.

పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నేడు తలపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు చేతికి అందించే క్రమంలో వేలమంది ఉద్యోగులు భాగస్వాములవుతుండగా, అక్కడక్కడ కూటమి ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కాబోతున్నారు. కూటమి శ్రేణులకు పెన్షన్ పంపిణీపై సూచనలు అందాయి. కూటమి తరఫున అందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెన్షన్ పంపిణీలో భాగస్వామ్యులు కావాలని అధిష్టానం పిలుపు నిచ్చింది. దాంతో కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా పెన్షన్ పంపిణీలో పాల్గొంటున్నారు. గ్రామాల్లోనూ, పట్టణా ల్లోనూ పండుగ వాతావరణంలో పెన్షన్ పంపిణీ చేసేలా కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కానున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి , జాయింట్ కలెక్టర్ ఆదిత్య, ఇతర అధికారులు

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

భీమవరం టౌన్, జూన్ 29 : 1వ తేదీన పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. శనివారం వెలగపూడి సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య, డీఆర్‌వో జె.ఉదయ భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు.ఒకటో తేదీనే నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయడానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇందుకు సంబంధించి బ్యాంకు నుంచి నగదును కూడా విత్‌డ్రా చేసినట్టు వివరించారు. పెన్షన్ల పంపిణీ కోసం వెంటనే క్షేత్ర స్థాయిలో బృందాలను ఏర్పాటు చేయాలని, సచివాలయ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులైన మండల స్థాయిలోని ఆర్‌ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, బిల్ కలెక్టర్లు, తదితర సిబ్బందిని పెన్షన్ల పంపిణీకి నియమించాలని అధికారులకు సూచించాం. పెన్షన్ల పంపిణీలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కాన్ఫరెన్స్‌లో డార్‌డీఏ పీడీ వేణుగోపాల్, జిల్లా గ్రామ వార్డు సచి వాలయాధికారి అప్పారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన జేఏసీ సభ్యులు

అధికారులకే రేవు బాధ్యతలు

జాయింట్ యాక్షన్ కమిటీ తీర్మానం

బాకీ చెల్లించని నిర్వహణదారుడు

నరసాపురం, జూన్ 29: మాధవాయిపాలెం-సఖినేటి పల్లి రేవులను వచ్చే నెల 3 నుంచి మండల పరిషత్ అధికారులు స్వాధీనం చేసుకుని రేవు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోని ఆధ్యక్షతన జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. రేవు నిర్వహణదారుడు రెడ్డప్ప ధవేజీ చెల్లించాల్సిన బాకీ రూ.53 లక్షలపై మరోసారి జేఏసీ సమావేశమయ్యారు. ఈనెల 21న రూ.35 లక్షలు చెల్లిస్తామని ధవేజీ జేఏసీకి ఇచ్చిన హామీకి అనుగుణంగా సొమ్ము చెల్లించలేదు. బాకీ మొత్తం పెరగడం, రేవు నిర్వహణ బాధ్యతలు, అతనిపై తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై కమిటీ సభ్యులు చర్చించారు. గతంలో ఆయనకు అనేక సార్లు అవకాశం ఇచ్చాం. కానీ స్పందన లేదు. బాకీ పడ్డ సొమ్ము చెల్లించక పోవడం, ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించ పోవడంతో రేవును అధికారులు స్వాధీనం చేసుకోవాలని సభ్యులు నిర్ణయించారు. బాకీ కట్టేవరకు ధవేజీకి సంబం ధించిన పంటును కూడా స్వాధీనం చేసుకో నున్నారు. అతనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని జేఏసీ సభ్యులు తీర్మానించి జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు సభ్యులు తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీవోలు శ్రీనివాస్, బొజ్జిబాబు, ఎంపీడీవో రమణరావు, జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీపీ మల్లికార్జునరావు, సర్పంచ్ రేపూరి ఏసు నర్సింహ రాజు పాల్గొన్నారు.

సార్వా సాగు వెనక్కు

వర్షాలతో పంట భూములకు ముంపు

3,500 ఎకరాల్లో నారుమడులు జాప్యం



భీమవరం రూరల్, జూన్ 29 : వర్షాల కారణంగా సార్వా సాగు వెనక్కు వెళ్లనుంది. ఇప్పటికే నారుమడులు పూర్తవ్వాల్సి ఉంది. అలాంటిది జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో సాగుకు సంబంధించి 5 వేల ఎకరాల్లో నారుమడులు పడాలి.1,500 ఎకరాలలో మాత్రమే వేశారు. గడిచిన ఐదు రోజులు నుంచి వర్షాల కారణంగా నారుమడులు నిలిచిపోయాయి. దానితో పాటు డెల్టాలో ఈనెల 20వ తేదీ నుంచి వేసిన నారుమడులు ముంపునకు గురయ్యాయి. దీంతో నీటిని బయటకు తోడే ప్రయత్నంలో రైతులు అవస్థలు పడుతున్నారు. ఆ నారుమడులు కొంత వరకు దెబ్బతినడం వల్ల నారు ఎదుగుదల ఆలస్యం అవుతుంది. మొత్తం మీద 80 శాతం నారుమడులు ఇంకా వేయాల్సి ఉన్నందున అవి జూలై 15వ తేదీ వరకు వేస్తారు. ఆ లెక్కన సార్వా నాట్లు ఆగస్టు నెల 3వ వారం నుంచి వేస్తారు. అంటే ఈ ఏడాది సార్వా పంట ఒక నెల ఆలస్యంగా సాగుతుంది. జూన్ నెల మొదటి వారంలో కాలువల నుంచి నీరు వచ్చినా ఎండలు వల్ల నారుమడుల వైపు రైతులు చూడలేదు. వాతావరణం చల్లబడిన తర్వాత నారుమడులకు వర్షాలు అడ్డంగా మారాయి.

మార్కెట్ కమిటీల రద్దు

- ఏఎంసీలలో ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం
- జిల్లాలో ముందుగానే రాజీనామాలు
- తాజా ఆదేశాలతో అన్ని ఖాళీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఏఎంసీ పాలకవర్గాలు రాజీనామా చేశాయి. తాడేపల్లిగూడెం, నర్సాపురంలో మాత్రం రాజీనామాలు సమర్పించలేదు. ఇప్పుడు వాటిని కూడా రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు జీవో జారీచేసింది. కొత్త కమిటీలు ఏర్పాటు చేసేంత వరకు ఇన్‌ఛార్జ్‌ల పాలన కొనసాగనుంది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పెనుగొండ, ఆచంట, నర్సాపురం, పాలకొల్లు, ఉండి, ఆకివీడులో వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల సిఫారసు మేరకు పాలకవర్గాలను నియమించారు. ఏడాది పరిమిత కాలానికి కమిటీలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. జిల్లాలో తాడేపల్లిగూడెం వంటి చోట్ల మరో ఏడాది పొడిగించారు. ఇలా రెండేళ్ల పాటు ఏఎంసీ పాలకవర్గాలు మనుగడ సాగించాయి. తాజాగా పాలకవర్గాలన్నింటినీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో అత్యధిక ఏఎంసీల్లో పాలకవర్గాలు రాజీనామా చేశాయి. నర్సాపురం తాడేపల్లిగూడెంలో మాత్రం రాజీనామాలు చేయకపోవడంతో ప్రభుత్వమే వాటిని రద్దు చేసింది. పాలకవర్గాల స్థానంలో ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తారు. సెలక్షన్ గ్రేడ్ అయితే మార్కెటింగ్ శాఖ జేడీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. అంతకు తక్కువ ఆదాయం ఉండే ఏఎంసీలకు డీడీలు, ఏడీలు ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు.

కొత్త పాలకవర్గాల కోసం చూపులు

కొత్త పాలకవర్గాల్లో చోటు దక్కించుకోవడానికి కూటమి శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. ఏఎంసీ ఛైర్మన్ కోసం ఆశావహుల సంఖ్య అధికంగానే ఉంది. ప్రధానంగా తెలుగుదేశం, జనసేన పార్టీలనుంచి ఛైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. పొత్తులో భాగంగానే గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి అభ్యర్థులు గెలుపొందారు. ఉండి, ఆచంట, తణుకు, పాలకొల్లులో తెలుగుదేశం ఎమ్మెల్యేలు, భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం నుంచి జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకంలోనూ కూటమి శ్రేణులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మూడు పార్టీల నుంచి కమిటీల్లో చోటు లభించే అవకాశం ఉంది. ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందనే విషయం ఆసక్తిగా మారింది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం చకా చకా చర్యలు తీసుకుంటోంది. వైసీపీ హయాంలో నియమించిన పాలక వర్గాలను రద్దు చేసింది. సహకార సంఘాల్లో ఇప్పటికే ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. త్రిసభ్య కమిటీలను రద్దు చేశారు. తాజాగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. త్వరలోనే ఏఎంసీ పాలకవర్గాలను భర్తీ చేయనున్నారు. కూటమి శ్రేణులు అందుకోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.



ఆచంట ఏఎంసీ కార్యాలయం

వైసీపీ హయాంలో ఏఎంసీలు నిర్వీర్యం

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏఎంసీలు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదు. పుంత రహదారులను అభివృద్ధి చేయలేదు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయలేదు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు పుంత రహదారులకు నిధులు కేటాయించారు. పనులు నిర్వహించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులకు చికిత్స అందించారు. వైసీపీ హయంలో మార్కెట్ సెస్ రూపంలో వచ్చిన నిధులను ప్రభుత్వం వినియోగించుకుంది. పేరుకే పాలకవర్గాలు పరిమిత మయ్యాయి. నాయకులు పదవులను మాత్రం అనుభవించారు. రిజర్వేషన్‌లు అంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. నిధులు మాత్రం ఇవ్వకుండా పాలకవర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో కొత్త పాలకవర్గాలు రానున్నాయి. అభివృద్ధి జరిగే అవకాశాలున్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం : కలెక్టర్

భీమవరం టౌన్, జూన్ 29 : జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్, విద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమం, పౌరసరఫరాల శాఖల అధికారులతో కలెక్టర్ విడివిడిగా సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 1వ తేదీన నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు వేగవంతం చేయాలన్నారు. వీఆర్వోల ద్వారా ఇంటింటి సర్వే చేయించి వారి కులం, మొబైల్ నెంబర్ తదితర పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాల న్నారు. తహశీల్దార్ వెరిఫికేషన్ అనంతరం కుల ధ్రువీకరణ పత్రాలను సచివాలయల ద్వారా పొందవచ్చునని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్లు, అదనపు తరగతి గదులు, రైట్ టు ఎడ్యుకేషన్, తదితర అంశాలపై సమీక్షించారు. పాఠశాలల్లో మనబడి నాడు- నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని, సమస్య ఎక్కడ ఉంది అనేది తెలుసుకొని వివరాలను అందించాలన్నారు. వరి విత్తనాల పంపిణీ, నారుమళ్లు, నాట్లుపై ఆరా తీసారు. త్వరితగతిన వరి నాట్లు పూర్తి చేయడానికి రైతులను సన్నద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానశాఖలపై సమీక్షించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు సమగ్ర కార్యచరణ ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.జేసీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు, డ్రైన్లు ఈఈ కిషోర్, కెనాల్స్ దక్షిణామూర్తి, డీఎస్‌వో సరోజ, సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామప్రసాదు, మత్స్య శాఖ అధికారి ప్రసాదు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



కవిటంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ

అందరికీ రుణ పడి ఉన్నా..సేవకుడిగా పనిచేస్తా

విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పోడూరు, జూన్, 29 : ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించినవారందికీ పేరుపేరునా రుణ పడి ఉంటానని రాబోయే ఐదేళ్లలో ప్రజలకు సేవకుడుగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలంలోని పి.పోలవరం, కవిటం, జగన్నాధపురం, పండిత విల్లూరు, తూర్పుపాలెం, పోడూరు, గుమ్మలూరు గ్రామాల్లో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకుని వస్తే తక్షణం పరిష్కరించి న్యాయం చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో తన దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ర్యాలీలో అడుగడుగునా పితానికి మహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు.పూలవర్షం కురిపించారు.ఆచంట నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రుద్రరాజు వెంకట్రామరాజు, జడ్పీటీసీ సురేష్ బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ బాబు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై తుది నివేదిక

జమా ఖర్చుల వివరాలను స్వీకరించిన పరిశీలకులు



భీమవరం టౌన్‌జూన్ 29 : నరసాపురం పార్లమెంటు, ఏడు నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను నరసాపురం పార్లమెంటు, నియోజక వర్గాల వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా, మోహిల్ అగర్వాల్, విక్ర మాదిత్య మీనాలు పరిశీలించారు. శనివారం కలెక్టరేట్‌లో నరసాపురం పార్లమెంటు, ఏడు నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ దస్త్రాలను స్వీకరించారు. అభ్యర్థుల పార్టీ ప్రచారంలో చేసిన ప్రచురణలు, ర్యాలీలు, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, సభలు, సమా వేశాలు, రోడ్ షోలు, వాహనాలు, తదితర ప్రచార ఖర్చుల దస్త్రాలను అధ్యయనం చేశారు. దస్త్రాలను పూర్తి అధ్యయనం చేసి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు నివేదికలను అంద జేస్తామని తెలిపారు.జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సూపరిం టెండెంట్ దుర్గాప్రసాదు, డిప్యూటీ తహసీల్దారు సన్యాసిరావు,వ్యయ పరిశీలకుల సహాయకులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 197 కేసులు రాజీ



రికవరీ సొమ్ము ఇప్పిస్తున్న న్యాయాధికారి

భీమవరం క్రైం, జూన్ 29 : భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల్లో పెండింగ్, ప్రిలిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారుల సౌకర్యార్థం కేసుల పరిష్కారం నిమిత్తం ఐదు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. అదాలత్‌లో 10 క్రిమినల్ కేసులు, 159 ప్రిలిటిగేషన్ కేసులు, 28 మొత్తం 197 కేసులు రాజీ అయ్యాయి. రాజీ అయిన కేసుల మొత్తం విలువ సుమారు ఒక కోటి ఎనభై లక్షల రూపాయలు అని తెలిపారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో ఒక చోరీ కేసులో రాజీ కుదిర్చి రికవరీ సొమ్ము లక్ష రూపాయలు ఫిర్యాదికి ఇప్పించారు. మరో దొంగతనం కేసులో కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి రికవరీ సొమ్ము ఆరువేలు, బంగారు ఆభరణాలు ఫిర్యాదుదారుకి ఇప్పించారు.

గోదారి పెరిగింది..



పాపికొండల విహారం ప్రారంభం

7



శ్రీవారి క్షేత్రానికి అల్పపీడనం ఎఫెక్ట్


పెరిగిన గోదావరి

» ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెరుగుతున్న నీటిమట్టం

పోలవరం, జూన్ 29 : పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలో గోదావరి నీటిమట్టం శనివారం నాటికి పెరిగింది. గత సోమవారం జలవనరుల శాఖ అధికారులు సీలేరు నుంచి రెండు వేల క్యూసెక్కుల విడుదల చేసిన జలాలు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పొంగిన కొండవాగుల జలాలతో పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన గోదావరి నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 22.950 మీటర్లు, స్పిల్వే దిగువన 15.300 మీటర్లు, కాఫర్ డ్యాంకు ఎగువన 23.000 మీటర్లు, కాఫర్ డ్యాంకు దిగువన 13.920 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ఈఈ పి.వెంకటరమణ తెలిపారు.

పాపికొండలకు బోట్ల రాకపోకలు ప్రారంభం

పాపికొండల విహార యాత్ర బోట్ల రాకపోకలు పునఃప్రారంభించామని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పాపికొండల పర్యటన బోట్ల రాకపోకలు పునరుద్ధరించామన్నారు. పాపికొండల విహార యాత్రకు ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకొను పర్యాటకులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సంబంధిత నంబర్లకు కాల్ చేసి నిర్ధారించుకుని టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.





పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద నీరు





ద్వారకాతిరుమల ఆలయంలో ఖాళీగా వైకుంఠం క్యూకాంప్లెక్స్.. క్యూలైన్‌లో తక్కువ మంది భక్తులు

శ్రీవారి క్షేత్రానికి అల్పపీడనం ఎఫెక్ట్

» ఆలయ ప్రాంగణంలో తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూన్ 29: అల్పపీడన ప్రభావం చినవెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై పడింది. స్వామికి ఇష్టమైన రోజుకావడంతో ప్రతీ శనివారం క్షేత్రానికి వేలాది సంఖ్యలో యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. శనివారం అల్పపీడన ప్రభావం కొనసాగుతుండడంతో ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఉదయం 11 గంటల నుంచి కాస్త భక్తుల రద్దీ పెరిగింది. తొలుత నామమాత్రంగా భక్తజన సంచారం నెలకొంది. దాదాపు ఆరు వేల మంది వరకు భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా శనివారం 15 నుంచి 20 వేల మంది వరకు భక్తులు క్షేత్రానికి వస్తారు. అల్పపీడన ప్రభావంతో ఆలయంలోని అన్ని విభాగాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

పోలవరం ప్రాజెక్టుకు ట్రైనీ ఐఏఎస్‌ల సందర్శన

పోలవరం/ఏలూరు కలెక్టరేట్/బుట్టాయగూడెం, జూన్ 29 : పోలవరం ప్రాజెక్టును ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ 2023-24 సంవత్సరం బ్యాచ్ ఐఏఎస్ ట్రైనీలు ఆరుగురు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని స్పిల్వే, హిల్‌వ్యూ, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, పవర్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు, వారికి ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత వివరాలను తెలిపారు. ఈ బృందంలో ఏపీలో కర్నూలు, చిత్తూరు, గుంటూరు, అనంతపురం, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాలకు నియమించిన ట్రైనీ కలెక్టర్లు సీహెచ్ కళ్యాణి, దామెర హిమవంశీ, పవార్ స్వప్నిల్ జగన్నాద్, బొల్లిపల్లి వినూత్న, హెచ్‌ఎస్ భావన, సుభమ్ నోక్వాల్ ఉన్నారు. పోలవరం తహసీల్దారు జీవీ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్, పీవోను కలసిన ట్రైనీ ఐఏఎస్‌లు

జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఏలూరు చేరుకున్న ఏపీ ట్రైనీ ఐఏఎస్‌లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజను ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలు వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్అండ్ఆర్ పథకంలో నిర్వాసితులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు తదితర వివరాలను ఐటీడీఏ పీవో వివరించారు.



పోలవరం ప్రాజెక్టు వివరాలు పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మంత్రి లోకేశ్‌ను కలసిన మాజీ మంత్రి సుజాత


భీమవరంటౌన్,జూన్ 29 : గత టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అంబేడ్కర్ విదేశీ విద్యాపథకం పేరు మళ్లీ పెట్టడంపై మంత్రి లోకేశ్‌ను మాజీ మంత్రి పీతల సుజాత కలసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉండవల్లిలో లోకేశ్‌ను కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో అంబేడ్కర్ పేరుపెడితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పేరు తొలగించి అంబేడ్కర్‌ను అవమానించిదన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు యువతకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల మేరకు సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.



డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధికి సినీనటుల సాయం

సినీ నిర్మాత అశ్వనీదత్ రూ.5 లక్షలు. నటుడు రావురమేష్ రూ.3 లక్షలు

ఉండి, జూన్ 29 :ఉండి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి సినీ నటులు సాయం అందిస్తున్నారని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ రూ.5లక్షలు, సినీ నటుడు దివంగత రావుగోపాలరావు తనయుడు రావు రమేష్ రూ.3 లక్షలు అందించారు. ఈవిధంగా అంతా ముందుకు వచ్చి తనకు అండగా నిలిచి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి ముందుకు రావడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు.



ఉండి ఎమ్మెల్యే రఘురామకు చెక్కు అందిస్తున్న సినీనటుడు రావురమేష్

నేషనల్ వాటర్ పోలో టోర్నమెంట్‌కు నాగసింధు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 29 : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జూలై ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి వాటర్‌పోలో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థిని ఐ.నాగసింధు అర్హత సాధించిందని స్కూలు ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పతకం సాధించడం ద్వారా బాలిక జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. విజేతను సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



నాగసింధును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఆచంట ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

ఆచంట, జూన్29 : ఆచంట ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో 2024-25విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత అనగా మొదటి విడతలో మిగిలిన సీట్ల కోసం కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరగోరు విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను స్వయంగా కళాశాలకు జూలై 24వ తేదీ లోపు అందజేయాలన్నారు. జూలై 24న కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఒరిజినల్‌సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని మరిన్ని వివరాలకు సెల్‌నెం. 9490111002కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమవరంటౌన్, జూన్ 29 :మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మాదక ద్రవ్య వ్యసనం ఆర్థిక సంక్షోభంలో పడేస్తుందని, కుటుంబం, స్నేహితులతో మీ సంబంధాన్ని నాశనం చేస్తుందని సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ జూనియర్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిస కావడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలతో కుంగిపోవడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ చాలా నష్టపోతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు పోలీసుశాఖ అనేక రకాల చర్యలు చేపడుతుందన్నారు. ఎక్సైజ్ ఆఫీసర్ చిట్టిబాబు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్, ఇతర వస్తురూపంలో ఇచ్చినట్టయితే అటువంటి స్వీకరించరాదని పిల్లలు, యువతను కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మత్తు పదార్థాల క్రయ విక్రయాలు సమాచారాన్ని పోలీస్ అధికారులకు తెలియజేసి జిల్లా పోలీస్ శాఖ సహకరించాలన్నారు.



విద్యార్థులు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ శివాజీ రాజు, కృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు సొసైటీలో అవకతవకలపై విచారించాలి

» జిల్లా కలెక్టర్‌కు కొత్తోట వాసి ఫిర్యాదు

మొగల్తూరు, జూలై 29 : మొగల్తూరు వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవకతవకలను విచారించాలని సంఘ సభ్యుడు కొత్తోట గ్రామానికి చెందిన పడవల సూర్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు శనివారం మొగల్తూరులో విలేకరులకు తెలిపారు. సంఘ చైర్‌పర్సన్, ఆయన కుటుంబ సభ్యుల పేరున 63 ఖాతాల ద్వారా రూ.1కోటి 67 లక్షల 63వేల 295లు రుణాలను సరైన పత్రాలు సమర్పించకుండా పొందారని ఈ మొత్తానికి సంబంధించి ప్రతీ ఏటా వడ్డీ, అసలును పెంచుతూ రుణాలు పెంచుతున్నారన్నారు. చెల్లించే వడ్డీలోనూ రాయితీని నిబంధనలకు విరుద్ధంగా పొందుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలులోనూ హమాలీ చార్జీల పేరుతో రూ.80 లక్షలు వరకు ఖర్చు చేయకుండా వాడుకున్నట్టు ఆరోపించారు. సంఘంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుండగా కోర్టు నుంచి స్టే రాకపోవడంతో వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంలో నాటి మంత్రి ద్వారా స్టే తెచ్చుకుని విచారణ మధ్యలో నిలిపివేశారన్నారు. ప్రభుత్వం మారినందున వైసీపీ మంత్రి ఇచ్చిన స్టేని రద్దు చేయించి సంబంధిత అధికారులు స్పందించి మొగల్తూరు సహకార సంఘంలో అవినీతిని వెలికి తీసి సంఘ సొమ్ము అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేసి సంఘాన్ని పరిరక్షించాలని కలెక్టర్‌ను ఫిర్యాదు పూర్వకంగా కోరినట్టు తెలిపారు.

సొసైటీ కార్యదర్శి రత్నాజీని సస్పెండ్ చేశాం

» జంగారెడ్డిగూడెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గురజాల

జంగారెడ్డిగూడెం, జూన్ 29:జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ సొసైటీ రైతులకు చెందిన నగదును దుర్వినియోగ పర్చిన కార్యదర్శి రత్నాజీని సస్పెండ్ చేశామని పీఏసీఎస్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన గురజాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సొసైటీలో నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణలో కార్యదర్శి రత్నాజీ నగదు దుర్వినియోగ పరిచిన ఆధారాలు లభించడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. శనివారం ఆయనకు సస్పెన్షన్ పత్రాలు అందించామన్నారు. సొసైటీ ఖాతాదారులు సోమవారం నుంచి యథావిధిగా కార్యాలయంలో సేవలు పొందవచ్చని తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు సహించం

కైకలూరు, జూన్ 29: కూటమి గెలుపుతో రాష్ట్రంలోనే కాక కైకలూరు నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరులో కూటమి నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కైకలూరు నియోజకవర్గంలో అరాచకాలు పెరిగిపోయాయంటూ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. అనివేటి మండపం, హిందూ శ్మశాన వాటిక నిర్మాణాలను దాతల సహకారంతో చేశారని వాటి జమా ఖర్చులను బయటపెట్టాలన్నారు.

డీజీపీ ద్వారకాతిరుమలరావుకు జోగయ్య లేఖ

పాలకొల్లు, జూన్ 29: ఒక మోసకారి తన పేరుతో ముఖ్యులైన తన మిత్రులకు ఫోన్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శనివారం మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య లేఖ రాశారు. ఒక వ్యక్తి 78010 96535 సెల్ నెంబరు నుంచి తన మిత్రులకు ఫోన్ చేస్తున్నాడని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ మాజీ మంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీ సుజనాచౌదరి, నరసాపురం మాజీ ఎంపీ కొత్తపల్లి సుబ్బారాయుడు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులకు ఆ వ్యక్తి ఫోన్ చేసి నాకేదో అత్యవసరం వచ్చిందని చెప్పగా నిజమేనని నమ్మి వీరందరూ ఆ వ్యక్తికి డబ్బులు ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఆ వ్యక్తి చేసే పని వల్ల తన పరపతి దెబ్బతింటుందన్నారు. ఈ ఘటనలను తాను పాలకొల్లు సీఐ, ఎస్ఐలకు ఆరు మాసాలు క్రితం తెలియపర్చినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇంకా ఈ ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ అగంతుకుడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

శ్రీవారికి రాష్ట్ర జనసేన ప్రొటోకాల్ చైర్మన్ పూజలు

ద్వారకాతిరుమల, జూన్ 29: చినవెంకన్న క్షేత్రాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మర్నీడి తిరుమలరావు (బాబి) సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి స్వామివారి శేషవస్త్రాన్ని, ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను పొందారు. కార్యక్రమంలో కూటమి నేతలు ఇమ్మడి రత్నాజి, కూరాకుల బుజ్జి, గువ్వల మావుళ్లు, రేపూరి వెంకటేశ్వరరావు, అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు జరుపుకుంటున్న తిరుమలరావు

సుబ్రహ్మణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.13 లక్షలు

ముదినేపల్లి, జూన్ 29: ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సంధ్య, దేవదాయశాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించిన లెక్కింపులో 197 రోజులకు రూ.13 లక్షల నగదు, 5 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి లభించాయి. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ శొంఠి నాగరాజు, వల్లభనేని రామకృష్ణ, శ్రీ దుర్గా సాయి సంఘ కమిటీ సభ్యులు, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, వీఆర్వో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





ఏలూరు, భీమవరంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

పోలీస్ శాఖలో సేవలు అభినందనీయం

» రిటైర్డ్ సిబ్బందిని సన్మానించిన ఉమ్మడి పశ్చిమ జిల్లా ఎస్పీలు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూన్ 29 :పోలీస్ శాఖలో 40 ఏళ్లపాటు సేవలందించడం అభినందనీయం అని, వీరంతా అందరికీ ఆదర్శనీయులని ఉమ్మడి పశ్చిమ జిల్లాల ఎస్పీలు మేరీ ప్రశాంతి, అజిత వేజెండ్ల అన్నారు. పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసులను శనివారం ఏలూరు, భీమవరంలలో సన్మానించారు. ఏలూరు జిల్లాలో తొమ్మిది మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పని చేస్తున్న ఎ.జగజ్జీవన్‌రామ్, వీఆర్ ఎస్ఐ బీవీసీ శేఖరరావు, వీఆర్ ఎస్ఐ వీవీ నాగేశ్వరరావు, ఏలూరు సీసీ ఎస్ఐ ఎస్.రాధాకృష్ణారెడ్డి, మండవల్లి ఏఎస్ఐ పి.జోసెఫ్, ఏలూరు ట్రాఫిక్ ఏఎస్ఐ జి.దిలీప్‌కుమార్, జిల్లా ఆర్మడు రిజర్వు విభాగం ఏఆర్ఎస్ఐ వీవీవీఆర్ వర్మ, నూజివీడు రూరల్ ఏఎస్ఐ జి.నరసింహారావు, ధర్మాజీగూడెం హెడ్‌కానిస్టేబుల్ సి.మంగయ్యను సన్మానించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పదవీ విరమణ పొందిన వారు హెచ్ రెహమాన్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (వీఆర్), ఎస్.హనుమంతరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్), ఎ.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (భీమవరం రూరల్ పీఎస్), టి.పాండురంగారావు, హెడ్ కానిస్టేబుల్ (మొగల్తూరు పీఎస్) వీరికి పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ అజిత వేజెండ్ల చేతుల మీదుగా సన్మానించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని వారు సూచించారు.

ఆకట్టుకున్న దశావతార కోలాట నృత్యం

ద్వారకాతిరుమల, జూన్ 29: శ్రీవారి క్షేత్ర తూర్పు రాజగోపురం వద్ద శనివారం సాయంత్రం దశావతారములతో కోలాట నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 222 మంది బృందసభ్యులు పాల్గొన్నారు. పొద్దుటూరుకు చెందిన సావిత్రిబాయి పూలే కోలాట బృంద సభ్యులు దశావతారాలైన మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బలరామ, బుద్ధ, కల్కి అలంకరణలో నృత్య ప్రదర్శన జరిపారు, ఇది చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కోలాటం మాస్టర్ జె.సాయిభరత్ నేతృత్వంలో బండి మల్లిక దీనిని నిర్వహించారు.



ఆలయ తూర్పు రాజగోపురం వద్ద నృత్యప్రదర్శన

క్రైం కార్నర్

రెండు లారీల మధ్య ఇరుక్కుని జట్టు కూలీ దుర్మరణం

» ప్రత్తిపాడు గొడౌన్ వద్ద ఘటన.. కేసు నమోదు

పెంటపాడు, జూన్ 29 : రెండు లారీల మధ్య ఇరుక్కుని ప్రమాదవశాత్తు జట్టు కూలీ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకట్రామన్నగూడెంకు చెందిన నల్లమాటి తాతారావు(43) కొంతకాలంగా ప్రత్తిపాడు నుంచి రాచర్ల రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీరూరల్ గొడౌన్‌లో జట్టు కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం యూరియా ఎరువులతో వచ్చిన లారీలో సరుకును గొడౌన్‌లోకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో సరుకును దించేసిన లారీ డ్రైవర్ వెనుక ఉన్న లారీని గమనించకుండా లారీని వెనక్కి రివర్స్ చేయడంతో ఎరువులు మోస్తున్న తాతారావు రెండు లారీల మధ్య చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూన్ 29 :ఆర్థిక పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీ డ్రైవర్ మనస్తాపంతో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని కొత్తగూడెంకు చెందిన గూడాబత్తుల జోసెఫ్(48) ఏలూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

ఒకరిని కొట్టి, బెదిరించిన తొమ్మిది మందిపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 29:జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన గోలి హరీష్‌కుమార్ ఇంటిపై హైదరాబాద్ చిత్రపురి కాలనీకి చెందిన గౌరీశంకర్ మరో ఎనిమిది మంది దౌర్జన్యంగా ప్రవేశించి కొట్టి, చంపుతామని బెదిరించిన వారిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గోలి హరీష్‌కుమార్‌కు చెందిన ఓ కేసు కోర్టులో ఉంది. ఈ నేపథ్యంలోట కేసు ఉపసంహరించుకోవాలని ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌కు చెందిన గౌరీశంకర్ మరో ఎనిమిది మంది హరీష్‌కుమార్‌ను జంగారెడ్డిగూడెంలో ఇంటికి వచ్చి బెదిరించారు. హరీష్‌కుమార్ అందుకు నిరాకరించడంతో అతడిపై దాడి చేశారు. హరీష్ కుమార్ రాజమహేంద్రవరంలో చికిత్స పొందిన తర్వాత జంగారెడ్డిగూడెం కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు గౌరీశంకర్ మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 29 : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఒక వ్యక్తి తిరిగి రాలేదని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరులోని ఆర్ఆర్ పేటకు చెందిన నలభై ఏళ్ల వయసు గల మన్నా దుర్గాప్రసాద్ ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం వెతికినప్పటికి ఆచూకీ కానరాలేదు. అతడి భార్య నాగమణి ఏలూరు టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పాలకోడేరు, జూన్ 29: నడుస్తూ వెళ్తున్న మహిళ మెడ నుంచి గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళుతూ మెడలో ఉన్న బంగారం తాడును అపహరించిన ఘటన పెన్నాడలో శనివారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన మునకాల రాజేశ్వరి అనే మహిళ ఉదయం గ్రామంలోనే సైన్ రెస్టారెంట్ సమీపంలో హైవేపై నడిచి వెళ్తుండగా భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న మోటారు సైక్లిస్టు వెనుక నుంచి వెళ్లి మహిళ మెడకలో ఉన్న రెండున్న కాసుల బంగారు గొలుసును అపహరించి వెళ్లిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

దెందులూరు, జూన్ 29 : విద్యుదాఘాతంతో గేదె మృతి మృతి చెందిన ఘటన దెందులూరు మండలం రామారావుగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన కొత్తపల్లి రామారావుకు చెందిన గేదె పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన మేత మేస్తుండగా వర్షం కురుస్తుండడం చేత నేల తేమగా ఉండడంతో గేదె మేత మేస్తూ విద్యుత్ స్తంభం సమీపానికి వెళ్లడంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. బాధితుడు ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.85 వేల విలువైన గేదె మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయానని, ఆదుకోవాలని కోరాడు.



గేదె కళేబరం

7న బియ్యం వేలం

భీమవరం టౌన్, జూన్ 29 : ప్రజాపంపిణీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ రవాణా చేస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి సీజ్ చేసిన బియ్యం 11.525 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వచ్చే నెల 7వ తేదీ వేలం వేస్తున్నట్టు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆరోజు ఉదయం 11 గంటలకు వేలం వేస్తామని వేలంపాటలో వచ్చిన గరిష్ఠ ధరను జేసీకి నివేదించి వచ్చిన సొమ్మును సివిల్ సప్లయ్ హెడ్ ఖాతాలో డిపాజిట్‌లో జమ చేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని, ముందుగా రూ.5 వేలు దరావతుగా చెల్లించాలన్నారు. వేలంపాట వివరాలను కలెక్టర్‌కు వివరించి ఖాయం చేసిన తరువాతనే హెచ్చు పాటదారునికి సరుకు అప్పగిస్తామన్నారు. వేలం నిలుపుదల చేయడం గాని, రద్దు పరిచే అధికారం జిల్లా అధికారులకు ఉందన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

గ్యాస్ట్రిక్ తగ్గుటకు
పథ్యము అవసరం లేదు ఎంతటి జఠిలమైన గ్యాస్ట్రిక్-అసిడిటీ అయినా శాశ్వతంగా నివారణ అగును. సంప్రదించండి. సెల్: 9866238384
AJD :177421

FLAT FOR SALE
» శ్రీ సాయితేజ రెసిడెన్సీ నందు 3BHK (1650 చ.అ.) తూర్పు ఫేస్ ఫ్లాట్ ఏలూరు సత్రంపాడు పంచాయితీ ఆఫీసు ఎదురుగా గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. 45 లక్షలు మాత్రమే. సంప్ర : 88855 11544
AJB - 194758

EDUCATION
» B.Sc., డిజిటల్ ఫోరెన్సిక్స్ & సైబర్ సెక్యూరిటీ / AI & ML / డేటా అనలిటిక్స్ - 3 సం.ల కోర్సులు. అర్హత : ఇంటర్ Bi.PC / MPC. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. ఇంటర్ మార్కుల ఆధారంగా డైరెక్ట్ అడ్మిషన్. అన్ని ప్రభుత్వ ఉద్యోగార్హత. అడ్మిషన్లకై సంప్ర. ఆంధ్రలయోల కాలేజ్, విజయవాడ. సెల్ : 77999 34688, 99125 67659
AJB -194718

పొలం అమ్మబడును
ఏలూరు.జిల్లా దిప్పకాయలపాడు, కొయ్యలగూడెం 22ఎకరాల పామాయిల్ పొలం 2 బోర్ల నీటి వసతితో అమ్మకమునకు కలదు. ఫోన్.9640999723
AJN:0000

AYURVEDIC
★ హెర్బల్ ఆయుర్వేదం 18 నుండి 75 వయసున్న వాళ్ళు శృంగారంలో తృప్తిని పొందడానికి మందులు వాడండి. ఇంద్రియ ఘాతాన్ని పెంచుకోండి. శృంగార సమయాన్ని 45 నిమిషాలకు పెంచుకోండి. స్త్రీలకు మందులు లభ్యం. ధన్వంతరి ఆయుర్వేదం. ఫోన్ : 7411506650 AJH-001961

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

BUSINESS OFFER
» Any person who is having a new business idea can contact us for help in starting the business. Contact us by whatsapp on 77995 77335.
AJB-194772

స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలి

భీమవరం అర్బన్ జూన్ 29: కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యలయంలో శనివారం వీరవాసరం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆరోజున 60 గ్రామాల ప్రజలు, రైతులు 19వేల ఎకరాల పంట భూమిని నివాస స్థలాలను త్యాగం చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్నివిధాల రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు.



మంత్రి లోకేశ్‌ను కలసిన రామరాజు

భీమవరం అర్బన్, జూన్ 29: మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

రాజ్యాంగానికి బీజేపీ తూట్లు

భీమవరం అర్బన్, జూన్ 29: రాజ్యాంగానికి తూట్లు పొడిస్తుంది బీజేపీ నేనని, రాజ్యాంగాన్ని కాపాడేది ఒక్క కాంగ్రెసు పార్టీ అని కాంగ్రెసు భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం అన్నారు. కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెసు పార్టీ ఎదుగుదల ఓర్వలేక ఇలా విమర్శలు చేస్తున్నారన్నారు. పార్టీ పై విమర్శలుచేస్తే సహించేది లేదన్నారు. ఇందిరా గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించిందని ఆమె దేశానికి ఏం తక్కువ చేశారని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారన్నారు.

ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను తొలగించాలని డిసెంట్



సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఏర్పాటు చేస్తున్న కౌన్సిలర్లు

ఆకివీడు, జూన్ 29: నగర పంచాయతీలో ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో ప్రతిపక్షాలకు వైసీపీ పాలక వర్గం, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మండిపడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జరుగుతున్న సమావేశానికి టీడీపీ, జనసేన కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, గోపిశెట్టి వెంకట సత్యవతి, గుర్రాని నాగలక్ష్మి, నేరెళ్ళ ప్రసన్నలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఫొటోలతో సమావేశానికి హాజరై హాల్‌లో ఏర్పాటు చేశారు. చైర్మన్ జామి హైమావతి, కమీషనర్ కృష్ణమోహన్ తదితర కౌన్సిలర్లు, సిబ్బందికి స్వీట్లు పంచారు. వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాని ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను తొలగించాలని డిసెంట్ అందజేశారు. వార్డుల్లో తాగునీరు, శానిటేషన్, డంపింగ్, వీధిలైట్లు సమస్యలు ఉన్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

పాలకోడేరు, జూన్ 29: వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు కాచిచల్లార్చిన నీటిని తాగాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్‌వి.రంగంనాయుడు అన్నారు. గొరగనమూడిలో మలేరియా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం ఆరోగ్య సిబ్బంది అంటురోగాలు, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి విషయంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ విజయ ప్రసాద్, ఏఎన్‌ఎంలు వేదకుమారి, సుజాత, ఆశావర్కర్ కుమారి పాల్గొన్నారు.

మొగల్తూరు: కాచి వడబోసిన నీటిని తాగాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లక్ష్మీ పార్వతి, సుధాకర్ కోరారు. శనివారం రామన్నపాలెం 1 సచివాలయ పరిధిలో పిట్టావారితోట, కెపిపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జ్ఞానరత్నం, రేవతి, మరియమ్మ, ఝాన్సీ, సంపత్ పాల్గొన్నారు.

పుస్తకాల గది సీజ్

ఉండి, జూన్ 29: ఉండిలోని ఇండియన్ డిజిటల్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విద్యా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ విద్యాశాఖకు ఎస్‌ఎఫ్‌ఐ ఉండి మండల కమిటీ ఫిర్యాదు చేసింది. దాంతో ఎంఈవో జ్యోతి పాఠశాలకు విచ్చేసి తనిఖీలు చేశారు. స్కూల్ బుక్‌స్టోర్‌ను సీజ్ చేస్తున్న ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో మండల ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు కె.చందు, కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం రద్దు

నరసాపురం రూరల్, జూన్ 29: గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు పాలకవర్గం రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు ఏఎంసీ కార్యదర్శి చాముండేశ్వరి తెలిపారు. దీంతో వైసీపీ ఏర్పాటు చేసిన పాలకవర్గం రద్దయింది. ప్రస్తుతం ఏఎంసీకి ఇన్‌చార్జి అధికారిగా ఏఎంసీ డిప్యూటి డైరెక్టర్ పి.లావణ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

'మానవత' కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గణపవరం, జూన్ 29: గణపవరంలోని కన్యకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు. మానవత సంస్థ మండల అధ్యక్షుడిగా బుద్దారపు పుల్లయ్య, కార్యదర్శిగా మాసేపల్లి చిరంజీవిరావు, కోశాధికారిగా పెరుమాళ్ళ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా కురెళ్ల వెంకటరత్నం, జాయింట్ సెక్రటరీ అడ్డాడ రామకృష్ణంరాజు మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు ప్రమాణస్వీకారం చేయించారు.

వైఎన్‌లో డేటా సైన్స్ కోర్సు ప్రారంభం

నరసాపురం, జూన్ 29: పట్టణంలోని వైఎన్ కళాశాలలో శనివారం డేటా సైన్స్ కోర్సును కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ స్థాయిలో బీఎస్సీ డేటా సైన్స్ కోర్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించేందుకు ఈ కోర్సు చక్కగా ఉపయోగపడుతుందన్నారు.

కృష్ణారావుకు ఉద్యోగ విరమణ సన్మానం



భీమవరం టౌన్, జూన్ 29 : ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటేనే తగిన గుర్తింపు లభిస్తుందని, సీనియరు ఉద్యోగుల నుంచి ప్రతి విషయాన్ని అవగతం చేసుకోవాలని జిల్లా కలెక్టరు సి.నాగరాణి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేలో జిల్లా కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్ టి.ఎ. కృష్ణారావు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో జిల్లా కలెక్టరు సి. నాగరాణి, జిల్లా జాయింటు కలెక్టరు సి.వి ప్రవీణ్ ఆదిత్య పాల్గొని పూల మాలలు, శాలువాలు కప్పి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

శ్రీనివాసరావుకు సన్మానం..

ఆకివీడు, జూన్ 29: సేవాభావంతో ప్రభుత్వ ఉద్యోగులు పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో వై.రామకృష్ణ అన్నారు. చెరుకుమిల్లి సెక్రటరీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసరావును శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. సూపరింటెండెంట్ శ్రీకర్, జూనియర్ అసిస్టెంట్ హెమారాణి పాల్గొన్నారు.

అధికారులకు అభినందన

ఉండి, జూన్ 29: ఎన్నికల బాధ్యతలను స్వీకరించిన అధికారులంతా సమైక్యంగా పనిచేయడంతోనే విజయం సాధించగలిగామని జిల్లా జాయింట్ కలెక్టరు ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. శనివారం ఉండి నియోజకవర్గస్థాయిలో లయన్స్ ఆడిటోరియంలో ఎన్నికలలో పనిచేసిన అధికారులకు అభినందనసభ జరిగింది. జాయింట్ కలెక్టరు ప్రవీణ్‌ఆదిత్యను ఘనంగా సన్మానించారు.

సొసైటీలకు ఇన్‌చార్జిల నియామకం

ఆచంట, జూన్ 29: గత ప్రభుత్వంలో సొసైటీల్లో త్రిసభ్య కమిటీలు ఉండగా ఆ కమిటీలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో సొసైటీలకు ఆఫీస్ ఇన్‌చార్జిలను నియమించారు. ఆచంటకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్. శ్రీనివాసరావు, కొడమంచిలికి కె. జోసఫ్ పాల్, కరుగోరుమిల్లి, వేమవరంలకు మహ్మద్ ఇస్మాయిల్ పాల్, వల్లూరు పి. ఆనంద్‌రాజ్‌లను నియమించగా వారు చార్జి తీసుకున్నట్లు ఆయా సొసైటీ కార్యదర్శులు తెలిపారు.






ఎమ్మెల్యే ఆరిమిల్లిని సత్కరిస్తున్న అధ్యాపకులు.. అంగన్వాడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాయకర్... పాలకొల్లులో కుంటుపడిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

జగన్ పాలనలో విధ్వంసం: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్ 29: మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలన అన్ని ప్రాంతాల్లో కన్పిస్తున్నదని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన శనివారం పాలకొల్లు పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వంలో 80శాతం పూర్తయిన బొండాడ వెంకటరాజు గుప్తా, ఎన్టీఆర్ కళాక్షేత్రం, నారా చంద్రబాబునాయుడు ఉద్యానవనం, అబ్దుల్‌కలాం ఉద్యానవనం, హిందూ కైలాసవనం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి మంత్రి రామానాయుడు పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో పనులకు నోచుకోక నిర్వహణ సక్రమంగా లేక ఆయా పనులు కొంతమేర ధ్వంసం అయ్యాయన్నారు. వీటన్నింటినీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా పనులు చేపట్టాలని అందుకు అవసరమైన నిధులు తీసుకొస్తానంటూ మంత్రి రామానాయుడు తెలిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పనులు జరగకపోగా రూ.15లక్షలు విలువైన కాపర్ వైరు దొంగిలించబడిందన్నారు. డంపింగ్ యార్డుకు సంబంధించి చెత్త తరలింపు పనులు 2020 నాటికి పూర్తి కావాల్సి ఉన్నా 30శాతం మాత్రమే జరిగాయన్నారు.

ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి: ఆరిమిల్లి

తణుకు: విద్యార్థులు బాగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం ఎస్కేవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన కెమిస్ట్రీ రీసెర్చ్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కళాశాలకు అవసరమైన వసతులు కల్పించడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కేవీ రావు కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌కు వంద కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డు భవనాల స్థానంలో పది గదులతో కూడిన ఒక బ్లాకును నిర్మించదలచామని, దీనికి రూ. 2 కోట్లు ఖర్చవుతుందని అమెరికాలో ఉన్న తమ సంస్థ ఇండియా నెట్ వర్కు ఫౌండేషన్ ద్వారా నిర్మించి ఇస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రాధాకృష్ణను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘాధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, ఫణిదర్, భూపాల్, రవీంద్రబాబుతోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగర.. సక్కుభాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వలవల.. పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మితో మాట్లాడుతున్న పార్టీ బీసీ నాయకులు

అంగన్వాడీలకు న్యాయం: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 29: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం అంగన్వాడీ వర్కర్లు ఎమ్మెల్యేని స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమ న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేసిన అంగన్వాడీకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా వెనుకబాటు లో ఉన్నందున న్యాయం చేసేందుకు కొంచెం సమయం పట్టినప్పటికి అంగన్వాడీలు ప్రజా సేవలో ముందుండాలన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

పాలకొల్లు టౌన్, జూన్ 29: బీసీ కార్పొరేషన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరుతూ మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ శనివారం ఆయనను ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 20శాతం రిజర్వేషన్ కల్పించాలని, చేతివృత్తులు వారికి పనిముట్లు అందచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: వలవల

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 29: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి అన్నారు. మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న కడియద్ద, పాలడుగుల సత్యనారాయణ, జగ్గన్నపేట పత్సా రామన్న, జగన్నాథపురంలో మెగలపు శ్రీనులను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతి చెందిన జగన్నాథపురానికి మార్రెడ్డి సక్కుభాయ్ మృతికి సంతాపం తెలిపి, కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: విద్యుదాఘాతంతో దంపతులు మృతి చెందడం బాధాకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన దంపతులు గట్టెం వెంకన్న, అన్నపూర్ణ కుటుంబీకులను శనివారం బాబ్జి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు.

స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు: నాయకర్

నరసాపురం రూరల్, జూన్ 29: తీర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. శనివారం లక్ష్మణేశ్వరం తాగునీటి ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్, ఇసుక, చెరువులోని నీటి సామర్థ్యం, క్లీనింగ్, పరీక్షలు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రాజెక్టుల్లోంచి నీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా అందడం లేదని, ఫిల్టర్ కాకుండానే నీటి సరఫరా జరుగుతుందని, పాత పైప్‌లైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన నాయకర్ తక్షణం కొత్తపైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో చాగంటి మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్, వైఎస్ బాబులు, ఎంపీటీసీ హరికృష్ణ, వాతాడి ఉమా, చాగంటి సురేష్ పాల్గొన్నారు.

సూరిబాబుకి ఏఎంసీ చైర్మన్ ఇవ్వాలి

భీమవరం అర్బన్, జూన్ 29: టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ బొక్కా సూరిబాబుకి భీమవరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి వచ్చేలా సహకరించాలని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిని శనివారం కలవడం జరిగిందిని నాయకులు తెలిపారు. సూరిబాబు పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి అన్నారు. తోట సీతారామలక్ష్మి మాట్లాడుతు తన సహకారం ఉంటుందని, ఈ విషయంపై పార్టీ నాయకుల అభిప్రాయం తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైఎస్ చైర్మన్ చెల్లబోయిన సుబ్బారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొక్కా చంద్రమోహన్, రైతు సంఘం నాయకులు పాల దాసు పాల్గొన్నారు.






కలెక్టర్ నాగరాణిని కలసిన రెవెన్యూ అధికార సంఘ నాయకులు.. డీసీసీబీ మాజీ చైర్మన్ రత్నం.. ఎస్పీ అజిత వేజెండ్ల

కలెక్టరుకు నాయకులు, ఉద్యోగుల శుభాకాంక్షలు

భీమవరం అర్బన్, జూన్ 29: పశ్చిమ గోదావరి జిల్లా నూతన కలెక్టర్ నాగరాణిని శనివారం భీమవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కృష్ణబలిజ సాధికారిక కమిటీ సభ్యులు గంటా త్రిమూర్తులు, పార్టీ సీనియర్ నాయకులు మద్దుల రాము, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాస్, ఐ-టీడీపీ అధ్యక్షులు మరపట్ల శ్యాంబాబు, విన్నకోట వినయ్ పాల్గొన్నారు.

భీమవరం క్రైం: పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నాగరణిని మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం నాడు కలిశారు. అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు.

ఆకివీడు: పశ్చిమ గోదావరి జిల్లాకి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ నాగరాణిని శనివారం డీసీసీబీ మాజీ చైర్మన్, సీఎస్ఎన్ కళాశాల అధ్యక్షులు ముత్యాల రత్నం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయనతో పాటు భీమవరం సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సీడీ సత్య నారాయణ ఉన్నారు.

భీమవరం టౌన్: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.నాగరాణిని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా పూర్తిగా సహకరిస్తారని తెలిపారు. అలాగే వీఆర్వోల సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి, వీఆర్వోల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల్ల జకరయ్య, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు కేవీవి సత్యనారాయణ, భీమవరం డివిజన్ జాయింట్ సెక్రటరీ వి. ముత్యాలు రావు, భీమవరం మండలం అధ్యక్షుడు ఆర్. రత్న రాజు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహం తనిఖీ

నరసాపురం టౌన్, జూన్ 29: పట్టణంలోని 19వ వార్డులోని బీసీ వసతి గృహాన్ని శనివారం కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా క్లోరినేషన్ చేసిన తరువాతే తాగునీటిని అందించాలన్నారు. శానిటేషన్ వంటి సమస్యలు ఉంటే 08814273332 నెంబర్‌కు కాల్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ సునీల్, ప్రభాకర్, అప్పారావులు పాల్గొన్నారు

95 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేయాలి

నరసాపురం టౌన్, జూన్ 29: పట్టణంలో సోమవారం లబ్ధిదారులకు ఇచ్చే పింఛన్ పంపిణీ 12 గంటకల్లా 95శాతం పూర్తి చేయాలని కమిషనర్ వెంకటేశ్వరావు ఆదేశించారు. శనివారం పురపాలక, సచివాలయ, వైద్య సిబ్బందికి పింఛన్ పంపిణీపై అవగాహన కల్పించారు. ఉదయం 6గంటలకు పింఛన్ ఇవ్వడం ప్రారంభించాలన్నారు. ఇటు సీఎం సందేశంతో కూడిన పాంప్లెట్‌ను లబ్ధిదారులకు అందించాలన్నారు.

- మండలంలోని 28 గ్రామాల్లో 11235 మంది లబ్ధిదారులకు పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. ఈ పంపిణీ సక్రమంగా జరిగే విధంగా మొత్తం 217 మంది సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించామన్నారు. సుమారు రూ.7.46 కోట్లను పింఛన్‌దారులకు సొమ్మును పంపిణీ చేస్తామన్నారు.

రామకృష్ణకు పదవీ విరమణ సత్కారం



నరసాపురం రూరల్, జూన్ 29: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు ఉంటుందని వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరావు అన్నారు. శనివారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి పదవి విరమణ పొందిన సాయిరామకృష్ణ దంపతుల్ని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఈలు డాక్టర్ అనిల్‌కుమారి, డాక్టర్ మురళీకృష్ణ, ఏవోలు రాజశేఖర్, రహీం, దేవి, జాన్సన్, సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

టెక్నాలజీని అప్‌డేట్ చేసుకోవాలి

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 29 : ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్స్ విద్యకు విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందున అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు ఫ్యాకల్టీ డెలప్‌మెంట్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు పి.ప్రదీప్‌కుమార్ అన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ బ్లాక్ చైన్ అంశంపై వారం రోజుల పాటు జరిగిన అధ్యాపక శిక్షణ శనివారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు, డా.వి చంద్రశేఖర్, డా.రవికిరణ్‌వర్మ, డా.డిఎన్ఎస్‌బి కవిత పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 29: నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిపదికన పట్టణంలోని మిలిటరీ కాలనీ, వానపల్లిగూడెం, ముస్లిం కాలనీ, గణేష్‌నగర్‌లో నూతన పైపులను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్ల అందజేత



ఉండి, జూన్ 29: ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పెదఅమిరం మహాత్మగాంధీ మెమోరీయల్ ట్రస్టు ఫౌండర్ పద్మశ్రీ ఎంఆర్‌రాజు ఆర్థిక సహాయంతో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్స్‌ను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు రామలక్ష్మీ అధ్యక్షత వహించారు. అనంతరం ఎంఆర్‌రాజును సన్మానించారు. రిటైర్డ్ డీఈవో ప్రసాద్‌రాజు, ముదునూరి శివరామరాజు, జగపతిరాజు, రామకృష్ణారావు, మధుసూధనరావు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

తణుకు, జూన్ 29: రాజీయే రాజమార్గమని నాల్గో అదనపు జిల్లా జడ్జి సత్యవతి అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 170 కేసులు రాజీ చేశామన్నారు. అదాలత్‌లో న్యాయాధికారులు కృష్ణ సత్యలత, పోతర్లంక సాయిరామ్, ఏవీ నాగరాజు, చిరంజీవిరావు, బార్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

సంచార విజ్ఞాన ప్రదర్శన

తణుకు, జూన్ 29: బైర్రాజు ఫౌండేషన్ సంచార విజ్ఞాన ప్రదర్శన మొబైల్ సైన్స్ ల్యాబ్ వాహనం శనివారం తేతలి జడ్పీ హైస్కూలులో ప్రదర్శించారు. బైర్రాజు ఫౌండేషన్, సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ సంయుక్తంగా జన్యువు- ఆరోగ్య సంధానం అనే అంశానికి సంబంధించి లింగ నిర్ధారణ, మేనరిక వివాహాలు, డీఎన్ఏ తదితర వీడియోలు గల ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు పుల్లారెడ్డి, శ్రీనివాసరాజు, బీఎం గోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మానవత కార్యవర్గం



పెనుగొండ, జూన్ 29: పెనుగొండ మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శిగా షేక్ మస్తాన్,కోశాధికారిగా యలమర్తి నరసింహరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కొమ్ముల రామకృష్ణ, ఈసీ ఎడ్యుకేషన్‌గా తానేటి జెమీమా, జాయింట్ సెక్రటరీగా నూలి నవీన్ కుమార్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వీకేపీ విద్యా సంస్థల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, గమిని రాంబాబు పాల్గొన్నారు.

184 కేసుల రాజీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 29: ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులు సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని తాడేపల్లిగూడెం మండల సర్వీస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయాధికారి షేక్ సికిందర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 184 కేసులను పరిష్కరించారు.

మొక్కు తీర్చుకున్న దంపతులు



భీమవరం టౌన్, జూన్ 29: హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి 1,118 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్, భీమవరం ఎమ్మెల్యేగా పులపర్తి రామాంజనేయులతోపాటు జనసేన అత్యధిక సీట్లలో విజయం సాధించాలని పట్టణానికి చెందిన అల్లం రమేష్, సత్యవాణి దంపతులు వెంకటేశ్వర స్వామికి మొక్కు కున్నారు. వారి కోరిక ప్రకారం జరగటంతో శనివారం ఆలయం వద్ద మొక్కును తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారికి కొబ్బరి కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

హరిచందనకు డాక్టరేట్



మొగల్తూరు, ఫిబ్రవరి 29: మొగల్తూరు పంచాయతీ వడయార్ పేటకు చెందిన పొన్నపల్లి హరి చందన ఫిలాసఫీ ఇన్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషియన్ విభాగంలో డాక్టరేట్ పొందింది. పొన్నపల్లి శ్రీనివాసరావు జయసుధల కుమార్తె చందన కర్నాటక రాష్ట్రంలోని దార్వాడ్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషియన్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 27వ తేదీన బెంగుళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ చేతల మీదుగా డాక్టరేట్ అందుకుందని వెను వెంటనే హైదరాబాద్‌లోని ఐసీఎమ్మార్‌లో టెక్నికల్ అధికారిగా ఉద్యోగం సాధించిందని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మొగల్తూరు, జూన్ 29: సామాజిక పెన్షన్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో వి.బాబ్జి రాజు శనివారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 10,786 మంది పింఛన్ లబ్ధిదారులుండగా రూ.7 కోట్ల 17 లక్షల 47 వేలను జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులతో పాటు పంచాయతీ ఉద్యోగులు ఎన్టీఆర్ పెన్షన్ కానుక పంపిణీలో పాల్గొంటారన్నారు.

ఇండియన్ స్కూల్‌కు అనుమతి లేదు: ఎంఈవో

ఆకివీడు, జూన్ 29:ఇండియన్ డిజిటల్ స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని ఎంఈవో ఏ.రవీంద్ర శనివారం మీడియాకు తెలిపారు. అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థులను జాయిన్ చేస్తే తరువాత తల్లిదండ్రులు విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు

ప్రకటన
మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప.గో.జిల్లా.
S.O.P: 1/2024
Between:
1.కర్రి విజయలక్ష్మి,
2.కర్రి మల్లికార్జున రెడ్డి,
3.కర్రి లోహిత్ సాయి వెంకటరెడ్డి
..పిటీషనరు 1 టు 3
And
మెట్‌లైఫ్ అలికో,
Rep by its మేనేజర్
అమెరికన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ,
క్లెయిమ్ డిపార్ట్‌మెంట్, లైఫ్ & పి.ఎ. మెట్‌లైఫ్ ఎమిరేట్స్
NBD, Post Box No.371919
దుబాయ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.
.. రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
పై నెంబరు S.O.P:1/2024 గ్రంథములో చనిపోయిన ప.గో. జిల్లా, అత్తిలి మండలం, పాలి గ్రామ కాపురస్తుడు అయిన (లేటు) కర్రి వెంకటరెడ్డి గార్కి చెందిన మెట్‌లైఫ్ ఎలికో ఇన్సూరెన్స్ కంపెనీ దుబాయ్, వారి కంపెనీ నుండి (లేటు) కర్రి వెంకటరెడ్డి గారి కి రావలసిన ఇన్సూరెన్స్ నగదు వాటా నిమిత్తం కర్రి వెంకటరెడ్డి గారి భార్య కర్రి విజయలక్ష్మి మరియు వారి కుమారులు అయిన కర్రి మల్లికార్జునరెడ్డి, కర్రి లోహిత్ సాయి వెంకటరెడ్డి వార్సు వారులుగా గుర్తించి వారికి రావలసిన ఇన్సూరెన్స్ నగదును ఇప్పించవలసినదిగా శ్రీ కోర్టు నందు కోరుతూ Succession Certificate కోసం పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు విషయముపై ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ది.19.07.2024 సం॥ తేదీన పై కోర్టు వారి యెదుట హాజరై ఉ॥ 10.30 ని.లకు తమ అభ్యంతరములకు తెలియపర్చుకోవలసినదిగా తెలియజేయడమైనది.
// by order // ఇట్లు
Sri K.Phanindra Reddy
తణుకు Advocate, Rajamahendravaram
Dt: 30/06/24 Cell: 9652129444

సాధారణ బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, CNR ఆక్వా ఎంటర్‌ప్రైజెస్ మరియు దాని యజమాని శ్రీ బర్రె జయరాజు, S/o గంటయ్య, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, నివాసం : డి.నం.6-194/1, మోదీ గ్రామం, కాళ్ల మండలం, కాలపవూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534201 వారు రూ.5,13,46,130/- (అక్షరాల ఐదు కోట్ల పదమూడు లక్షల నలభై ఆరు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే) లకు వ్యతిరేకంగా మా క్లైంటు తీర్పు పొందిన కారణంగా, గౌరవనీయులైన 34వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, బెంగుళూరు, మేయో హాల్ యూనిట్, శ్రీ బర్రె జయరాజుకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్‌లను కూడా జారీ చేసింది. ఏ వ్యక్తి అయినా తన స్థానం మరియు ఆచూకీ గురించి అవగాహన కలిగి ఉన్నట్లయితే, దిగువ సంతకం చేసిన వ్యక్తికి వీలైనంత త్వరగా తెలియజేయవలసి ఉంటుంది. పై తీర్పు అనుగుణంగా శ్రీ బర్రె జయరాజుకు చెందిన ఏదైనా ఆస్తి దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవలసిందిగా మేము సాధారణ ప్రజలను కూడా కోరుతున్నాము. సమాచారం ఇచ్చేవారికి తగిన రివార్డు ఉంటుంది.
శ్రీ గంజల వెంకట నాగరాజు, తండ్రి : రామస్వామి, వయస్సు సుమారు 47 సంవత్సరాలు, నివాసం : డి.నెం.29/170-189-4ఎ, ఇనగుదూరుపేట, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వారు మా క్లయింట్‌కు అనుకూలంగా, టైటిల్ డీడ్ డిపాజిట్ ద్వారా, R.Sలో 2059 చదరపు గజాల (501.666 చ.గజాలు + 1577.333 చదరపు గజాలు) ఆస్తి నం.401, డి.నం.29/170-98, ఇనగుదూరుపేట, అమృతపురం, బాదరు తూర్పు, రెవెన్యూ వార్డ్ నం.1, మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో, మచిలీపట్నం SROలో, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఆస్తి నా క్లయింట్‌కు తనఖా పెట్టబడినందున దానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరపకూడదని లేదా ఏ విధమైన లావాదేవీలు చేయవద్దని మేము సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నాము.
చిరునామా :
మెస్సర్స్ వెంకటేష్, అమర్‌నాథ్ & కో.,
న్యాయవాదులు,
నెం.432, 1వ అంతస్తు, 12వ క్రాస్,
సదాశివనగర్, బెంగళూరు- 560 080
ఫోన్ : +91-9886140745, +91-9738129600